

చలి పంజా

ఉదయం చలి గాలులు వీస్తుండటం, రాత్రివేళ ఉష్ణోగ్రతలు పడిపోతుండడంతో ప్రజలు గజగజ వణుకుతున్నారు. 8లో▸



విచారణ చేపట్టండి

పెళ్లి ఇంట్లో బంగారం చోరీ ఘటనను ప్రత్యేక కేసుగా పరిగణించాలని ఎమ్మెల్యే సబితారెడ్డి పోలీసులను కోరారు. 8లో▸



రెండో రోజు విచారణ

మల్కీజ్‌గూడ గ్రామంలోని డ్వాక్రా సంఘాల్లో నిధుల అవకతవకలపై మంగళవారం రెండో రోజు విచారణ కొనసాగింది. 8లో▸

న్యూస్‌రీల్

పౌల్ట్రీ రైతుల సమస్యలు పరిష్కరించండి

మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు వినతి



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, రైతులు

షాద్‌నగర్: పౌల్ట్రీ పరిశ్రమ ఆస్తి పన్ను బకాయిలు రద్దు చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసి వినతిపత్రం సమర్పించారు. పౌల్ట్రీ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రికి వివరించారు. గతంలో మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పౌల్ట్రీలకు ఆస్తి పన్ను వేసిన దాఖలాలు లేవని, కేవలం షాద్‌నగర్ మున్సిపాలిటీలో మాత్రమే పన్ను విధించారని చెప్పారు. కొత్త మున్సిపల్ చట్టం ప్రకారం పౌల్ట్రీని ఒక యూనిట్‌గా చేసి వంద రూపాయలు మాత్రమే మెయింటెనెన్స్ కింద వసూలు చేయాలని ఉందని మంత్రి దృష్టికి తెచ్చారు. పౌల్ట్రీ రైతుల ఇబ్బందులను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. మంత్రిని కలిసిన వారిలో పౌల్ట్రీ రైతులు వెంకట నారాయణ, రామారావు, ఆనందరావు, అర్జున్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ కార్మిక సంఘాలపై ఆంక్షలు ఎత్తివేయాలి



ఇబ్రహీంపట్నం డిపో ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

ఇబ్రహీంపట్నం: ఆర్టీసీ కార్మిక సంఘాలపై ఆంక్షలు ఎత్తివేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బ్రహ్మయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇబ్రహీంపట్నం డిపో ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికులపై ఆంక్షలు ఎత్తివేసి, సంఘాల గుర్తింపు ఎన్నికలు తక్షణమే నిర్వహించాలని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీని కాంగ్రెస్ పాలకులు అమలు చేయాలన్నారు. లేదంటే బీఆర్ఎస్‌కు పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎల్లేష్, బుగ్గరాములు, యాదగిరి, పోచమోని కృష్ణ, చందునాయక్, సత్యానారాయణ, విగ్నేష్, వీరేష్, యదయ్య, దిలీప్ పాల్గొన్నారు.

ఆదిబట్లలో డీటీసీపీ అధికారుల పర్యటన

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని పార్కు స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టారని వచ్చిన ఫిర్యాదుల మేరకు డీటీసీపీ అధికారులు మంగళవారం పర్యటించారు. డీటీసీపీఓ సువర్ణ ఆధ్వర్యంలో పార్కు స్థలాల్లో చేపట్టిన నిర్మాణాలను పరిశీలించారు. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి, దస్తావేజులు పరిశీలించి అడిషనల్ కలెక్టర్‌కు నివేదిక ఇస్తామని తెలిపారు.

హైదరాబాద్ మెట్రోకు 'ఐజీబీసీ ప్లాటినం'



సాక్షి, సిటీబ్యూరో: దేశంలోనే మొదటిసారిగా హైదరాబాద్ మెట్రో రైల్ ప్రతిష్టాత్మకమైన ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (ఐజీబీసీ) ప్లాటినం–సర్టిఫైడ్ మెట్రో నెట్‌వర్క్‌గా గుర్తింపును పొందింది. ఎల్అండ్‌టీ హైదరాబాద్ మెట్రో రైల్ నెట్‌వర్క్‌లోని మొత్తం 57 మెట్రో స్టేషన్లకు ప్రతిష్టాత్మకమైన ఐజీబీసీ గ్రీన్ ఎగ్జిస్టింగ్ ఎమ్మార్టీఎస్ ప్లాటినం సర్టిఫికేషన్ సాధించినట్లు ఎల్అండ్‌టీ అధికారులు తెలిపారు. రెడ్, బ్లూ, గ్రీన్ లైన్ కారిడార్‌లలోని స్టేషన్లన్నింటిలోకీ దేశంలోనే ఈ తరహా సర్టిఫికేషన్ పొందిన మొదటి సంస్థగా నిలిచినట్లు పేర్కొన్నారు. ఐజీబీసీ ఆధ్వర్యంలో ఇటీవల బెంగళూరులో జరిగిన గ్రీన్ బిల్డింగ్ కాంగ్రెస్ కార్యక్రమంలో ఈ సర్టిఫికెట్‌ను పొందినట్లు వెల్లడించారు.

అద్దె భవనాలే దిక్కు!

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సొంత గూడు కరువు

- కొన్నిచోట్ల స్థల కేటాయింపులతో సరి
- మరికొన్ని చోట్ల అర్ధంతరంగా నిలిచిన పనులు
- ప్రభుత్వానికి రూ.లక్షలు సమకూరుతున్నా సమస్యలు మాత్రం యథాతథం
- కనీస సౌకర్యాలు లేక రిజిస్ట్రేషన్‌కోసం వచ్చేవారికి ఇబ్బందులు
- చర్యలు తీసుకోవాలంటున్న జనం

ప్రభుత్వానికి నెలకు రూ.లక్షల్లో ఆదాయం సమకూర్చి పెట్టే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు సమస్యలతో సతమతమవుతున్నాయి. ఏళ్ల తరబడి అద్దె భవనాలు.. అరకొర సౌకర్యాల మధ్య కొనసాగుతున్నాయి. శాశ్వత భవనాలకు కొన్ని చోట్ల ముందడుగు పడినా నిధుల కొరత వెంటాడుతోంది. మరికొన్ని ప్రాంతాల్లో మధ్యలోనే పనులు నిలిచిపోయాయి. ఇటు రిజిస్ట్రేషన్ కోసం వచ్చే వారితో పాటు అటు సిబ్బంది సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సాక్షి పరిశీలన

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వానికి ఆదాయ వనరులు సమకూర్చే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఇబ్రహీంపట్నంలో దశాబ్దాలుగా ఓ పురాతన అద్దె భవనంలో కొనసాగుతోంది. నాలుగైదు నెలలుగా రోజుకు 35 నుంచి 40 వరకు డాక్యుమెంట్స్ రిజిస్ట్రేషన్ అవుతున్నాయి. సుమారు నెలకు రూ.2 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి సమకూరుతోంది. నిత్యం క్రయవిక్రయాలు, మార్టిగేజ్‌లు తదితర పనులపై ఈ కార్యాలయానికి 300 నుంచి 350 మంది వరకు వస్తుంటారు. కనీసం కూర్చునేందుకు సరైన సౌకర్యం లేదు. మరుగుదొడ్లు, మూత్ర విసర్జనకు బయటకు వెళ్లాల్సిందే. ఆఫీసు సిబ్బంది ఇరుకు గదుల్లోనే విధులు నిర్వర్తిస్తున్నారు. డాక్యుమెంట్లను భద్రపరిచేందుకు అనువైన స్థలం భవనంలో కొరవడింది. పార్కింగ్ స్థలం లేక రోడ్లకు ఇరువైపులా వాహనాలను నిలుపుతున్నారు. కార్యాలయం ముందు ట్రాఫిక్ సమస్య జటిలంగా మారుతోంది.

కొత్త భవనం ఎప్పుడో..

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి శాశ్వత భవనం నిర్మించాలని గత ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి భావించారు. పాత బస్టాండ్ వద్ద ఉన్న పురాతన గిడ్డంగులు (గోదాములు) తొలగించి మున్సిపల్‌కు ఆదాయాన్ని సమకూర్చే దుకాణ సముదాయం, అందులోనే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా 2022 ఫిబ్రవరిలో అప్పటి మంత్రి కేటీఆర్‌తో భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయించారు. భవన నిర్మాణానికి డీఎంఎఫ్‌టీ నుంచి రూ.1.50 కోట్లను మంజూరు చేశారు. తొలివిడత మంజూరైన నిధులతో గ్రౌండ్ లెవెల్ స్లాబ్ వరకు సదరు కాంట్రాక్టర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ నిర్మాణ పనులు చేపట్టారు. ఆ ఆ తర్వాత నిధులు రాకపోవడంతో రెండేళ్లుగా పనులు నిలిచిపోయాయి. భవన నిర్మాణానికి రూ.కోటి మంజూరు చేయాలని టీయూఎఫ్ఐడీసీ (రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) మున్సిపల్ అధికారులు ప్రతిపాదనలు పంపి నెలలు గడుస్తున్నాయి.



ఇబ్రహీంపట్నంలో మధ్యలోనే నిలిచిపోయిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ నూతన భవనం



అద్దె భవనంలో కొనసాగుతున్న ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

భవనం సరిపోవడం లేదు

రోజుకు 30 నుంచి 40 డాక్యుమెంట్లు అవుతాయి. నెలకు సుమారు రూ.2 కోట్ల ఆదాయం సమకూరుతోంది. ఈ భవనం సరిపోవడం లేదు. మున్సిపల్ స్థలంలో పాత బస్టాండ్ వద్ద సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ నూతన భవనం నిర్మాణం జరుగుతోంది. అది పూర్తికాగానే నామినల్ అద్దెతో అందులోకి కార్యాలయం మార్చుతారని సమాచారం.

– సోని, ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్, ఇబ్రహీంపట్నం

ప్రతిపాదనలు పంపాం



మంజూరైన 18 లక్షల రూపాయలతో డీఎంఎఫ్‌టీ (డిస్ట్రిక్ మినరల్ ఫండ్ ట్రస్ట్) నిధులతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ స్లాబ్ లెవల్ పనులు పూర్తి చేశాం. మరో కోటి రూపాయల కోసం టీయూఎఫ్ఐడీసీకి ప్రతిపాదనలు పంపాం. నిధులు రాగానే పనులు ప్రారంభిస్తాం.

– రవీంద్రసాగర్, మున్సిపల్ కమిషనర్, ఇబ్రహీంపట్నం

త్వరగా పూర్తి చేయాలి



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి శాశ్వత భవన నిర్మాణానికి రెండేళ్ల క్రితం శ్రీకారం చుట్టారు. అధికారుల నిర్లక్ష్యంతో పనులు ఆగిపోయాయి. నిధులు మంజూరుకాలేదని చెతులెత్తేస్తున్నారు. అసంపూర్తి నిర్మాణం కారణంగా చెత్తచెదారం, పిచ్చిమొక్కలతో కంపుకొడుతోంది. భవన నిర్మాణం త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలి.

– అశోక్, స్థానికుడు, ఇబ్రహీంపట్నం



అద్దె భవనంలో కొనసాగుతున్న మహేశ్వరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

❖ కనీస వసతులు కరువు

మహేశ్వరం: అంగట్లో అన్నీ ఉన్నా.. అల్లుడి నోట్లో శని అన్న చందంగా మారింది మహేశ్వరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిస్థితి. భూముల రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.లక్షల్లో ఆదాయం వస్తున్నా కార్యాలయానికి వచ్చే ప్రజలకు కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయానికి శాశ్వత భవనం లేక అద్దె భవనంలో కొనసాగిస్తున్నారు. నగరానికి కూతవేటు దూరంలో కలెక్టర్ కార్యాలయం, శంషాబాద్ విమానాశ్రయం, ఔటర్ రింగ్ రోడ్డు, ఇండస్ట్రియల్ పార్కులు, కందుకూరులో త్వరలో ఫోర్త్ సిటీ ఏర్పాటు కానుండడంతో ఇక్కడ భూములకు మంచి డిమాండ్ ఉంది. రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ప్రజలు పెద్ద ఎత్తున వస్తుంటారు. మహేశ్వరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రస్తుతం రోజుకు 50 నుంచి 60 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అవుతున్నాయి. రియల్ ఎస్టేట్ జోరుగా జరిగే సమయంలో రోజుకు 120 నుంచి 150 డాక్యుమెంట్లు అయ్యేవి. తాగునీరు, మూత్ర శాలలు, కూర్చోవడానికి విశ్రాంతి గదులు లేకపోవడంతో కార్యాలయానికి వచ్చే వారికి తిప్పలు తప్పడం లేదు. భూముల రిజిస్ట్రేషన్ కోసం వచ్చే వారి వాహనాలను పార్కింగ్ చేయడానికి స్థలం లేక రోడ్డుపైన, ఇళ్ల మధ్య పార్కింగ్ చేస్తున్నారు. నూతన భవన నిర్మాణానికి స్థల సేకరణ చేసి నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

❖ స్థలం కేటాయించినా..

చేవెళ్ల: ప్రభుత్వానికి నిత్యం ఆదాయవనరుగా పనిచేసే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి సొంత భవనం లేక అద్దె భవనంలో కాలం వెళ్ల దీస్తున్నారు. మండలకేంద్రంలో ఏళ్ల తరబడిగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం అద్దె భవనంలోనే కొనసాగుతోంది. ప్రభుత్వం స్థలం కేటాయించినా నిధులు మంజూరు చేయకపోవడంతో సొంత భవనం కరువైంది. ప్రస్తుతం రోజుకు నాలుగు నుంచి పది రిజిస్ట్రేషన్లు మాత్రమే జరుగుతున్నాయి. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది రిజిస్ట్రేషన్ల సంఖ్య భారీగా తగ్గిందని సిబ్బంది చెబుతున్నారు. చేవెళ్ల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలోకి చేవెళ్ల, మొయినాబాద్, షాబాద్ మండలాలు వస్తాయి. వారానికి ఈ కార్యాలయం నుంచి ప్రభుత్వానికి సుమారు రూ.30లక్షల నుంచి రూ.40లక్షల ఆదాయం సమకూరుతోంది. సొంత భవనం ఉంటే అన్ని విధాలా సౌకర్యవంతంగా ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అద్దె భవనంలో ఎన్ని ఏర్పాట్లు చేసినా అవి తాత్కాలికమేనని అంటున్నారు.

నిధులు వస్తే సొంత భవనం

చేవెళ్ల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి ప్రభుత్వ స్థలం కేటాయింపు జరిగింది. స్థలాన్ని పరిశీలించాం. త్వరలోనే నిధుల కేటాయింపుతో సొంత భవనం ఏర్పాటవుతుంది. అద్దె భవనం అయినప్పటికీ అన్ని రకాల సౌకర్యాలు కల్పించాం. గతంతో పోలిస్తే రిజిస్ట్రేషన్ల సంఖ్య బాగా తగ్గింది.

– వెంకటరమణ, సబ్‌రిజిస్ట్రార్, చేవెళ్ల



అద్దె భవనంలో కొనసాగుతున్న చేవెళ్ల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

భూ నిర్వాసితులకు న్యాయం చేయాలి

మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్



రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్

ఇబ్రహీంపట్నం రూరల్: పరిశ్రమల ఏర్పాటు కోసం భూములు కోల్పోయిన భూ నిర్వాసితులకు ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ డిమాండ్ చేశారు. మండలంలోని ఎల్మినేడులో రైతులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భూములు కోల్పోయిన రైతులకు 2013 చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని అన్నారు. భూ బాధితులకు ఎకరానికి వెయ్యి గజాల ప్లాటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాటి ప్రభుత్వం శివన్నగూడ ప్రాజెక్టు కోసం చేపట్టిన భూసేకరణలో ఎకరానికి రూ.5లక్షల చొప్పున పరిహారం ఇచ్చిందని తెలిపారు అక్కడ ఉన్న నాలుగు గ్రామల రైతులు భూమి కోల్పోయి ప్రస్తుతం కార్మికులుగా మారారని గుర్తు చేశారు. ఎల్మినేడులో 600 ఎకరాల భూమి సేకరించినప్పుడు పరిహారంతో పాటు ప్రభుత్వ ఉద్యోగం, ఇంటి స్థలం ఇవ్వకపోవడం అన్యాయమని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం దగ్గర లక్ష ఎకరాల భూమి బ్యాంకు ఉందని, దీంతో లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇవ్వొచ్చని సూచించారు. ప్రతి రైతుకు టీడీఆర్ (ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్) కల్పించాలని కోరారు. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని, బీజేపీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బోసుపల్లి ప్రతాప్, అర్జున్‌రెడ్డి, జక్క రవీందర్‌రెడ్డి, లచ్చిరెడ్డి, దండె శ్రీశైలం, నిర్వాసితుల ఫోరం అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మన్సాన్‌పల్లిలో సర్వే తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

సర్వేపై అపోహలు వద్దు

కలెక్టర్ నారాయణరెడ్డి

మహేశ్వరం: సమగ్ర కుటుంబ సర్వేపై ఎలాంటి అపోహలు వద్దని కలెక్టర్ నారాయణరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని మన్సాన్‌పల్లిలో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వేను మంగళవారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రణాళికల రూపకల్పన చేసేందుకే ఇంటింటి సర్వే చేపడుతోందని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ సర్వేకు సహకరించాలని సూచించారు. సర్వే జరుగుతున్న తీరును పరిశీలించి, ఎన్యుమరేటర్‌కు తగు సలహాలు, సూచనలు ఇచ్చారు. సర్వేలో ఏ ఒక్క కుటుంబాన్నీ విడిచి పెట్టొద్దని, అన్ని కుటుంబాల వివరాలు సమగ్రంగా సేకరించాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మహేశ్వరం ప్రభుత్వ ఆస్పత్రి, ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో వైద్యులు ఓపీ రిజిస్టర్ సక్రమంగా నిర్వహిస్తున్నారా.. రోగులకు వైద్య సేవలు అందించి సరైన మందులు అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. రోగులతో మాట్లాడి వైద్యులు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. డాక్టర్లు సమయ పాలన పాటించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం, వంట గదిని పరిశీలించి వంటలను రుచి చూశారు. విద్యార్థులతో మాట్లాడి డిజిటల్ టీవీని వారితో ఓపెన్ చేయించారు. రాబోయే 10వ తరగతి పరీక్షల్లో ఎంత మంది 10 జీపీఏ సాధిస్తారో వారందరికీ రూ.10 వేల ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ సైదులు, ఎంపీడీఓ శైలజ, ఎంపీఓ రవీందర్‌రెడ్డి, ఎంఈఓ కస్నా నాయక్ తదితరులు ఉన్నారు.



మహేశ్వరం ప్రభుత్వ పాఠశాలలో కూరలు రుచి చూస్తున్న కలెక్టర్

రైతులకు ఇబ్బంది రానీయొద్దు



ఆమనగల్లులోని కొనుగోలు కేంద్రంలో వరిధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

ఆమనగల్లు: ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, తెచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని ఆమె సూచించారు. ఆమనగల్లు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో మంగళవారం సాయంత్రం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని పరిశీలించి వారితో మాట్లాడారు. తమ ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కొందరు రైతులు ఫిర్యాదు చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని అన్నారు. అవసరమైన తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, గన్నీ బ్యాగులు, టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచాలని ఆమె సూచించారు. రైతులు పండించిన ధాన్యం గ్రేడ్ ఏ రకానికి రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300, సన్నరకం ధాన్యానికి క్వింటాల్‌కు అదనంగా రూ.500 బోనస్ చెల్లిస్తున్నట్లు చెప్పారు. ధాన్యం విక్రయించిన రైతుల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసి కేటాయించిన రైస్‌మిల్లులకు ధాన్యం తరలించాలని ఆదేశించారు. ఆమె వెంట పీఏసీఎస్ సీఈఓ దేవేందర్, మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌గౌడ్, ఏఈఓలు నిఖిత, భూదేవి తదితరులు ఉన్నారు.

చిన్నారుల్లో సృజనాత్మకత పెంపొందించాలి



సభలో మాట్లాడుతున్న సుద్దాల అశోక్ తేజ

ప్రముఖ కవి, సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ

ఇబ్రహీంపట్నం రూరల్: చిన్నారుల్లో సృజనాత్మకత, శాస్త్రీయ ఆలోచన పెంచే దిశగా పని చేయాలని ప్రముఖ కవి, సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ అభిప్రాయపడ్డారు. ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని భారత్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం తెలంగాణ బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో సుద్దాల అశోక్‌తేజ రాసిన ఘల్లుఘల్లు అనే పాటను ప్రముఖ రచయిత నందిని సిద్దారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి సుద్దాల అశోక్‌తేజ మాట్లాడుతూ.. విష సంస్కృతి, సామ్రాజ్యవాద వినిమయ విలువల నేపథ్యంలో మానవీయ విలువలు కనుమరుగవుతున్నాయని అన్నారు. కులమత, మూఢత్వం పేరుతో దాడులు పెరుగుతున్నాయని తెలిపారు. చిన్నారుల ఆలోచనలను విషపూరితం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రముఖ రచయిత నందిని సిద్దారెడ్డి మాట్లాడుతూ.. బాలల్ని అభ్యుదయం దిశగా ప్రోత్సహించాలని అన్నారు. బాలోత్సవం కార్యదర్శి సోమన్న మాట్లాడుతూ.. నాలుగేళ్లుగా వందలాది మంది పాఠశాల విద్యార్థులతో వేలాది మంది బాలబాలికలతో ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. విద్యార్థుల్లో సైంటిఫిక్ టెంపర్, సరికొత్త ఆలోచనల్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భారత్ విద్యాసంస్థల చైర్మన్ సీహెచ్ వేణుగోపాల్‌రెడ్డి, బాలోత్సవ కమిటీ బాధ్యుడు బుచ్చిరెడ్డి, జనవిజ్ఞాన వేదిక నాయకులు రమేష్, భాస్కర్, భూదేవి, శ్రీకాంత్, యశోకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక కేసుగా విచారణ చేపట్టండి



బాధిత కుటుంబసభ్యులను ఓదార్చుతున్న మాజీ మంత్రి సబితారెడ్డి

మాజీ మంత్రి సబితారెడ్డి

శంకర్‌పల్లి: పట్టణంలో ఆదివారం రాత్రి మున్సిపల్ కౌన్సిలర్ రాధా బాలకృష్ణ ఇంట్లో బంగారం చోరీ ఘటనను ప్రత్యేక కేసుగా పరిగణించి, దొంగలను పట్టుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్‌ని ఫోన్‌లో కోరారు. మంగళవారం ఆమె బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. మరో రెండు రోజుల్లో కూతురు వివాహం ఉండగా.. ఇలా జరగడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు కేసును త్వరగా ఛేదించి పోయిన సొత్తును రికవరీ చేసి అప్పగిస్తారని కౌన్సిలర్ కుటుంబసభ్యులకు భరోసా కల్పించారు. పోలీసులు దుండగులను పట్టుకుని కఠినంగా శిక్షించాలన్నారు. సబితారెడ్డి వెంట శంకర్‌పల్లి పీఏసీఎస్ చైర్మన్ శశిధర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, నాయకులు నారాయణ, విఠలయ్య, దండు రాజేశ్వర్, ప్రవీణ్‌కుమార్, మహేందర్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మల్కీజ్‌గూడలో రెండో రోజు విచారణ



డ్వాక్రా సంఘం భవనంలో కొనసాగుతున్న విచారణ

యాచారం: మల్కీజ్‌గూడ గ్రామంలోని డ్వాక్రా సంఘాల్లో నిధుల అవకతవకలపై మంగళవారం రెండో రోజు విచారణ కొనసాగింది. యాచారం ఎస్‌బీఐ మేనేజర్ జాన్సీ, సెర్ప్ ఏపీఎం సుదర్శన్‌రెడ్డిలతో పాటు బ్యాంకు, సెర్ప్ సిబ్బంది పాల్గొన్నారు. ఏడాది కాలంగా విలేజ్ బుక్ కీపర్ వరికుప్పల రాణి ఏఏ సంఘాలకు ఎన్ని రుణాలు ఇప్పించింది? రికవరీ ఎలా ఉంది?రుణాలు పొందిన మహిళలు మల్కీజ్‌గూడ గ్రామానికి చెందిన వారేనా..? తీసుకున్న రుణాలు ప్రతీ నెల వాయిదాలు సక్రమంగా చెల్లిస్తున్నారా అనే విషయాలపై రికార్డులను తనిఖీలు చేశారు. రెండో రోజు విచారణకు వీబీకే వరికుప్పల రాణి హాజరైంది. గ్రామంలోని 45 సంఘాల రికార్డులను మహిళా సంఘాల సభ్యుల సమక్షంలోనే పరిశీలించనున్నట్లు సెర్ప్ ఏపీఎం సుదర్శన్‌రెడ్డి తెలిపారు. దుర్వినియోగమైన ప్రతీ పైసా రికవరీ చేస్తామని, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా సహకరించాలి

ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు

యాచారం: సాగర్ రహదారిపై ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రజలు సహకరించాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు సూచించారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలో చిరు వ్యాపారులు, ప్రయాణికులు, ప్రజలతో మాట్లాడారు. గ్రామాల్లో కొత్త వ్యక్తుల సంచరించినా, చోరీలు జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. యువత డ్రగ్స్, మద్యానికి అలవాటు పడకుండా తల్లిదండ్రులే జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. సాగర్ రహదారిపై వాహనాల రద్దీ తీవ్రత దృష్ట్యా చిరువ్యాపారులు రోడ్డుపైనే కాకుండా వెనక్కు జరిగి వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట సీఐ నర్సింహారావు తదితరులు ఉన్నారు.

చలి పంజా

పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- పెరుగుతున్న చలి తీవ్రత
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు



జాతీయ రహదారిపై కురుస్తున్న మంచు (ఫైల్)

షాబాద్: జిల్లాలో చలి తీవ్రత పెరుగుతోంది. ఉదయం చలి గాలులు వీస్తుండటం, రాత్రి వేళ ఉష్ణోగ్రతలు పడిపోతుండడంతో ప్రజలు గజగజ వణుకుతున్నారు. వృద్ధులు, పిల్లలు చలిబారిన పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. తెల్లవారుజామున చలితీవ్రత మరింత అధికంగా ఉంటుడడంతో రోడ్ల వెంట, ప్రధాన వీధుల్లో చలి మంటలు వేసుకుంటూ ఉపశమనం పొందుతున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- రోజురోజుకు ఉష్ణోగ్రతలు పడిపోతున్నందున వ్యాధులు దరిచేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.
- ఉదయాన్నే గోరువెచ్చని నీటిని తీసుకోవాలని, చలిలో తిరగాల్సి వస్తే చెవులు, ముక్కుకు గాలి తగలకుండగా ఉన్ని దుస్తులు, మంకీ క్యాప్ లాంటివి ధరించాలి.
- వేడిగా ఉన్న ఆహార పదార్థాలనే భుజించాలి. శీతల పానీయాలు ఐస్‌క్రీంలు, ఇతర చల్లటి తినుబండారాలకు దూరంగా ఉండడం మేలు. స్వీట్లు తక్కువగా తీసుకుంటే మంచిది.
- పిల్లల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలి. తల్లి పొత్తిళ్లలో ఎక్కువ సమయం ఉండేలా చూసుకోవాలి. ప్రయాణం చేయాల్సి వస్తే శరీరాన్ని పూర్తిగా కప్పేసి ఉంచాలి.
- అస్తమా వ్యాధిగ్రస్తులు ఆయాసం రాకుండా మందులు వేసుకోవాలి. అత్యవసరంగా బయటకు వెళ్లాల్సి వచ్చినప్పుడు మాస్కులు ధరించాలి.
- చలికాలంలో శరీరం పొడిబారకుండా నువ్వుల నూనెను స్నానానికి ముందు ఒంటికి రాసుకుంటే మెరుగైన ఫలితాలు ఉంటాయి.

అప్రమత్తత అవసరం



రోజురోజుకు చలితీవ్రత పెరుగుతుండడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. అస్తమా, శ్వాసకోస వ్యాధులతో బాధపడేవారిని బయట తిరగకుండా చూడాలి. ఏడాదిలోపు పిల్లలు ఉన్న గది వేడిగా ఉండేలా జాగ్రత్త తీసుకోవాలి. ఐదేళ్లలోపు చిన్నారులకు స్వెట్టర్లు, మాస్కులు వేయాలి. లేందటే నిమోనియా వచ్చే అవకాశం ఉంది.

– డాక్టర్ విజయలక్ష్మి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, షాబాద్

గుర్తు తెలియని యువకుడి మృతి



శంకర్‌పల్లి: గుర్తు తెలియని యువకుడు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మోకిల సీఐ వీరబాబు తెలిపిన ప్రకారం.. ఈ నెల 11న మోకిల పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో జన్వాడ పరిధిలోని ఇంద్రారెడ్డి నగర్‌లో ఓ యువకుడు(32) స్పృహ కోల్పోయి ఉన్నాడు. స్పందించిన పోలీసులు వెంటనే ఆయన్ను సంగారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆయన మంగళవారం పరిస్థితి విషమించి రమృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. కేసు దర్యాప్తులో ఉంది.

‘చలో హైదరాబాద్’ను జయప్రదం చేయండి



కలెక్టరేట్ ఎదుట దివ్యాంగుల రిలే దీక్ష

వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

ఇబ్రహీంపట్నం రూరల్: ఆసరా పెన్షన్లు పెంచాలని కోరుతూ ఈ నెల 26న చేపట్టనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కరంటోత్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. పెన్షన్లు పెంచాలని కోరుతూ వీహెచ్‌ఎస్‌పీఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన దీక్షలు మంగళవారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. పెన్షన్లు పెంచే వరకు పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. హైదరాబాద్ ముట్టడికి దివ్యాంగులంతా హాజరవ్వాలని పిలుపునిచ్చారు.

తప్పిన పెను ప్రమాదం

కీసర: ఓ ప్రైవేటు పాఠశాల బస్సు అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొడుతూ వెళ్లి ముందున్న చెట్టు ముందు నిలిచిపోయింది. ప్రమాద సమయంలో బస్సులో సుమారు 40 మంది విద్యార్థులున్నారు. వీరిలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన మంగళవారం కీసర మండలం కుందన్‌పల్లి చౌరస్తా సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు వివరాల ప్రకారం.. చీర్యాల చౌరస్తాలోని ఓ ప్రైవేటు స్కూల్ బస్సు రోజు మాదిరిగానే కీసర, కీసరదాయర, రాంపల్లి దాయర, గోధుమకుంట, కుందన్‌పల్లిల నుంచి విద్యార్థులను తీసుకుని వస్తోంది. ఈక్రమంలో కుందన్‌పల్లి చౌరస్తా సమీపంలో ఎదురుగా వచ్చిన కారును డ్రైవర్ బస్సును పక్కకు తిప్పాడు. వేగంతో బస్సు అదుపు తప్పి పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని కొట్టింది. స్తంభం విరిగి కింద పడిపోయింది. ఆ ధాటికి మరో రెండు విద్యుత్ స్తంభాలు నేలకు ఒరిగాయి. కరెంటు తీగలు బస్సులో పడిపోయాయి. ఆ సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పెను ప్రమాదమే తప్పింది. బస్సు అదే వేగంతో చెట్టును ఢీకొట్టి నిలిచిపోయింది. కాగా.. రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బస్సు ఢీకొని ఉంటే పెను ప్రమాదమే సంభవించేది. ప్రమాద సమయంలో బస్సులో 40 మంది విద్యార్థులున్నారు. పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. డ్రైవర్ రాజు బస్సును అక్కడే వదిలేసి పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. స్థానికంగా ఉన్న ప్రజలు, అటుగా వెళ్తున్న వాహనదారులు విద్యార్థులను బస్సులో నుండి బయటకు దింపారు. విషయం తెలిసిన వెంటనే విద్యార్థుల తల్లిదండ్రులు ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకు గురయ్యారు. తమ పిల్లలను వాహనాల్లో ఇళ్లకు తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

వ్యవసాయ పనిముట్ల దొంగల అరెస్ట్



పోలీసులు స్వాధీనం చేసుకున్న వ్యవసాయ పనిముట్లు

చేవెళ్ల: పొలాల వద్ద వ్యవసాయ పనిముట్లు దొంగిలిస్తున్న ఇద్దరు వ్యక్తులను రైతులు పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని పామెనలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. పామెనలో కొంత కాలంగా రైతుల వ్యవసాయ పనిముట్లు, స్టార్టర్లు గుర్తు తెలియని వ్యక్తులు అపహరిస్తున్నారు. దీంతో రైతులు పొలాల వద్ద నిఘా పెట్టారు. ఈ క్రమంలో మధ్యాహ్నం ఇద్దరు వ్యక్తులు పొలాల వద్ద అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని నిలదీశారు. వారు చెప్పిన సమాధానాలు పొంతన లేకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు పోలీసులు వారి వద్ద వ్యవసాయ పనిముట్లను స్వాధీనం చేసుకుని ఇద్దరినీ అరెస్ట్ చేశారు. రైతుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కల్లు దుకాణాలపై ఎక్సైజ్ దాడులు



ఓ కల్లు దుకాణంలో శాంపిల్స్ సేకరిస్తున్న ఎక్సైజ్ ఎస్ఐ ఖాజామొయినుద్దీన్, సిబ్బంది

చేవెళ్ల: మండల పరిధిలోని పలు గ్రామాల్లోని కల్లు దుకాణాల్లో మంగళవారం చేవెళ్ల ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఖానాపూర్, దామరగిద్ద, అంతారం, గొల్లపల్లి, ఇబ్రహీంపల్లి, కౌకుంట్ల తదితర గ్రామాల్లో చేవెళ్ల ఎక్సైజ్ సీఐ శ్రీలత ఆదేశాలతో ఎస్ఐ ఖాజామొయినుద్దీన్ సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. ఈ దాడుల్లో ఆయా కల్లుదుకాణాల్లో శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్‌లకు పంపించినట్లు సీఐ శ్రీలత తెలిపారు. నిషేధిత మత్తు పదార్థాలను కల్లు తయారీలో ఉపయోగించటంపై నిఘా ఉంచామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా రసాయనాలు కలిపినట్లయితే ఆ కల్లు దుకాణాల యజమానులపై కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

బీసీల అభ్యున్నతికి కృషి

జీసీ మహాసభ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న రాఘవేంద్ర కాలనీవాసులు

షాద్‌నగర్‌రూరల్: బీసీల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని బీసీ మహాసభ జిల్లా అధ్యక్షుడు క్యాసెట్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పట్టణంలోని రాఘవేంద్ర కాలనీ వాసులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ.. బీసీలు ఆర్థిక, రాజకీయ, విద్య, ఉద్యోగ, సామాజిక రంగాల్లో వెనుకబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. జనాభా బీసీలు అధికంగా ఉన్నప్పటికీ వారికి రావాల్సిన రిజర్వేషన్లు అందడంలేదన్నారు. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లను కల్పించేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీసీల సంక్షేమం, అభివృద్ధికి చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీసీ మహాసభ రాష్ట్ర ప్రధానకార్యదర్శి మానసాటి ప్రదీప్ కుమార్, నాయకులు వినోద్‌కుమార్‌గౌడ్, నర్సింలు, యాదయ్య, కాశన్న, రఘునందన్‌రెడ్డి, మదన్‌మోహన్, వెంకటేశ్, ట్యాంకర్ నర్సింహ, రవి, గుడ్డు యాదవ్, మహేశ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ భూముల్లోకి జీవాలను అనుమతించాలి

జీఎంపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు పెంటయ్య యాదవ్



పడకల్ పశువైద్య కేంద్రం వద్ద జీఎంపీఎస్ నాయకులు

తలకొండపల్లి: ఫారెస్ట్ భూముల్లో మూగ జీవాలను మేపేందుకు అనుమతించాలని గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం(జీఎంపీఎస్) రాష్ట్ర కమిటీ సభ్యుడు జల్లెల పెంటయ్య యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మండల పరిధిలోని పడకల్‌లోని పశువైద్య కేంద్రం వద్ద గొర్రెల కాపరులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పెంటయ్య మాట్లాడుతూ.. మూగ జీవాలను మేపుతుండా ఫారెస్ట్ అధికారులు భౌతికంగా దాడులు చేస్తున్నారని ఆరోపించారు. తమపై దాడి చేసిన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని కోరారు. పశువైద్య సిబ్బంది సకాలంలో విధులకు హాజరవ్వడం లేదని ఆరోపించారు. గొర్రెలకు వ్యాధి నిరోధక మందులు ఇవ్వడం లేదని.. ఏడాది నుంచి నట్టల నివారణ మందులు వేయడం లేదని వాపోయారు. పడకల్ ఫారెస్టులో మూగ జీవాలను మేపుకొనేందుకు చెరువులు, కుంటల్లోని తుమ్మ చెట్లు కొట్టుకునేలా జీఓ ఉందని, ఫారెస్టు భూముల్లో మేపడానికి పోతే అధికారులు రానివ్వకపోతే ఎలా అని ప్రశ్నించారు. గొర్రెల, మేకలకు ప్రభుత్వమే ఉచితంగా ఇన్సూరెన్స్ చేయాలని.. సబ్సిడీతో కూడిన దాణా పంపిణీ చేయాలని కోరారు. పశు వైద్య కేంద్రాలు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని చేసేలా చూడాలన్నారు. 50 ఏళ్లు పైబడిన గొర్రెల కాపరులకు రూ.5వేల పింఛన్ ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వ ఎస్ఎల్ఎం పథకంలో గొల్ల కురుమల యువతకు 50 శాతం రిజర్వేషన్‌తో, గొర్రెల ఫామ్స్ ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలని ప్రభుత్వానికి కోరారు. కార్యక్రమంలో రాములు, వెంకటయ్య, అంజయ్య, పర్వతాలు, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

భూములు ఇవ్వకుంటే కేసులా?

మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం

పూడూరు: భూములు ఇవ్వని రైతులపై థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తారా..? ఇది ప్రజారాజ్యమా.. పోలీసుల రాజ్యమా అని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంగళవారం మండల పరిధిలోని మన్నెగూడలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లగచర్లలో జరిగిన ఘటనలో అమాయక రైతులపై కేసులు నమోదు చేసి భయభ్రాంతులకు గురి చేయడం సరికాదన్నారు. ఫార్మా పేరిట రైతులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడం, భౌతికంగా దాడులు చేసి జైలుకు పంపించారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి రైతులకు క్షమాపణ చెప్పి కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కలెక్టరే తనపై దాడి జరగలేదని చెప్పాక అరెస్టులు ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు.

తిరుపతిరెడ్డి ఎవరు?: మాధవరెడ్డి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోకట్ మాధవరెడ్డి మాట్లాడుతూ.. ఫార్మాబాధితులను పరామర్శించేందుకు వెళ్తున్న మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని అరెస్టు చేయడం బాధాకరమన్నారు. పోలీసులు తిరుపతిరెడ్డికి ఎస్కార్ట్ ఇచ్చి గౌరవించడం ఏంటని..? అసలు తిరుపతిరెడ్డి ఎవరని ప్రశ్నించారు. ఫార్మా ఏర్పాటును ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దిశ కమిటీ సభ్యులు ప్రభాకర్ రెడ్డి, వడ్ల నందు, ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యుడు మల్లేశం, బీజేపీ జిల్లా నాయకులు కేపీ రాజు, రమేశ్, రాముయాదవ్, రాజునాయక్, పార్టీ మండల అధ్యక్షుడు రాఘవేందర్ పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం



రూపాలి(ఫైల్)

మైలార్‌దేవ్‌పల్లి: ఇంటి నుంచి బయటికి వెళ్లిన బాలిక అదృశ్యమైన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ పైడినాయుడు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..మహారాష్ట్ర, నాందేడ్ ప్రాంతానికి చెందిన పండిత్ పోదాడి, అంజలి దంపతులు కాటేదాన్ ప్రాంతానికి వలస వచ్చి కార్మికులుగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరి కుమార్తె రూపాలి (16) గత నెల 28న పనికి వెళ్లి తిరిగి రాలేదు.దీంతో కుటుంబ సభ్యులు ఆమె కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని వృద్ధురాలి దుర్మరణం



చాంద్ బీ(ఫైల్)

మైలార్‌దేవ్‌పల్లి: రైలు ఢీకొని ఓ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి...శాస్త్రీపురం డివిజన్ షమాకాలనీకి చెందిన చాంద్‌బీ(70) మంగళవారం సాయంత్రం ఉడెంగడ్డ రైల్వేట్రాక్ దాటుతుండగా అదే సమయంలో వేగంగా వచ్చిన రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది.స్థానికుల సమాచారంతో రైల్వే పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యాంటీ బయోటిక్స్ అతిగా వినియోగిస్తే అనర్థమే



అవగాహన ర్యాలీలో పాల్గొన్న గాంధీ వైద్యులు, సిబ్బంది

గాంధీఆస్పత్రి: యాంటీబయోటిక్స్ మాత్రలు అతిగా వినియోగిస్తే అనర్థమే, రోగ నిరోధక శక్తి తగ్గి మరిన్ని రుగ్మతలకు కారణమవుతుందని వైద్య నిపుణులు హెచ్చరించారు. గాంధీ మెడికల్ కాలేజీ మైక్రో బయాలజీ విభాగం ఆధ్వర్యంలో వరల్డ్ యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్ అవేర్‌నెస్ వీక్ సందర్భంగా గాంధీ ఆస్పత్రి, మెడికల్ కాలేజీల ప్రాంగణంలో మంగళవారం యాంటీబయోటిక్స్ వాడకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇందిర, సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి ముఖ్య అతిథులుగా మాట్లాడారు. వైద్యుల సలహా మేరకే యాంటిబయోటిక్స్ వినియోగించాలని సూచించారు. జ్వరం, దగ్గు, జలుబు వంటి సాధారణ రుగ్మతలకు మెడికల్ షాపుల్లో కొనుగోలు చేసిన యాంటిబయోటిక్స్ ఇష్టానుసారంగా వినియోగించడంతో రోగ నిరోధక శక్తి క్రమంగా సన్నగిల్లుతుందన్నారు. వైద్యుల ప్రిస్క్రిప్షన్, సలహా మేరకు మాత్రమే యాంటీబయోటిక్స్ వాడాలని సూచించారు. ‘యూజ్ రైట్ డ్రగ్, రైట్ డోస్, రైట్ టైమ్’ నినాదంతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మైక్రోబయోలజీ హెచ్‌ఓడీ ప్రొఫెసర్ సురేఖ, వైస్ ప్రిన్సిపాల్ రవిశేఖరరావు, ఆర్ఎంఓ-1 శేషాద్రి, ఇన్‌ఫెక్షన్ కంట్రోల్ ఆఫీసర్ డాక్టర్ పూజ, ఎంపీహెచ్‌ఓ వేణుగోపాల్ పాల్గొన్నారు.